క్లుప్తంగా

21,23 తేదీల్లో సాదా బైనమా గ్రామసభలు



మాట్లాడుతున్న తహసీల్దార్

గూడూరురూరల్: మండలంలోని పాలిచెర్ల, చెమిర్తి, ఎస్ఎస్ కండ్రిగలో అగ్రిమెంట్ ద్వారా కొనుగోలు చేసిన భూములను క్రమబద్ధీకరించేందుకు ఈ నెల 21, 23 తేదీల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బాలలీలారాణి తెలిపారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సాదా బైనమా కార్యక్ర మం విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ క్రమంలోనే మండలంలో రీ సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో కేవలం అగ్రిమెంట్ ద్వారా భూములు కొనుగోలు చేసి ఉన్న రైతులు సాదా బైనమాలో దరఖాస్తు చేసుకుని భూములను క్రమబద్ధీకరించేందుకు గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

సిమ్ కార్డుల అందజేత



సిమ్ కార్డు అందజేస్తున్న వైద్యాధికారి

దొరవారిసత్రం: తొగరాముడి పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన సిమ్ కార్డులను స్థానిక వైద్యాధికారి లిల్లీరాణి అందజేశారు. ఇటీవల ట్యాబ్‌లను అందజేసిన విషయం తెలిసిందే. ఈ ట్యాబ్‌ల్లో ఆరోగ్య కార్యకర్తలు గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్య పరిస్థితి, టీకాలు తదితర వివరాలు అన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జనార్దనయ్య పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కరించుకోండి



ఊడిపూడిలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

పెళ్లకూరు: భూ రీసర్వేతో భూ సమస్యలు సత్వరమే పరిష్కరించుకోవాలని మండల ప్రత్యేకాధికారి రూపేంద్రరెడ్డి సూచించారు. శుక్రవారం ఊడిపూడి గ్రామంలో జరిగిన సాదాబైనామా గ్రామసభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఇటీవల చేపట్టిన భూ రీసర్వేకి సంబంధించి 31 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా తక్కువ మంది మాత్రమే గ్రామసభకు హాజరై భూ సమస్యలను పరిష్కరించుకున్నారని తెలిపారు. తక్కిన రైతులు రెవెన్యూ కార్యాలయంలో సంప్రదించి, భూ సమస్యలను నివృతి చేసుకోవాలన్నారు. సర్పంచ్ దేవారెడ్డి నాగేంద్రరెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ సురేష్‌బాబు పాల్గొన్నారు.

బయో ఉత్పత్తులు వాడొద్దు



రైతులకు అవగాహన చేస్తున్న అధికారులు

పెళ్లకూరు: కూరగాయలు సాగులో బయో ఉత్పత్తులను వాడొద్దని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ డాక్టర్ భాస్కరయ్య సూచించారు. శుక్రవారం చెంబడిపాళెంలో ఆత్మా ఆధ్వర్యంలో కూరగాయల సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ బయో ఉత్పత్తుల వాడకంతో రైతులు నష్టాలు బారిన పడుతున్నారన్నారు. కార్యక్రమంలో హెచ్ఓ శారద, సహాయకులు శ్రీరాములు, మహేష్ పాల్గొన్నారు.

సీఐ బాధ్యతల స్వీకరణ

రాపూరు: స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కోటేశ్వరావు శుక్రవారం బాధ్యతలు చేట్టారు. ఈయన నెల్లూరు పోలీస్ శిక్షణ కేంద్రంలో పనిచేస్తూ బదిలీపై రాపూరు సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న నాగమల్లేశ్వరావు వీఆర్‌కు వెళ్లారు. సీఐని సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలు క్రాంతికుమార్, ప్రభాకర్, ఉమాశంకర్, అనూష కలసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇద్దరు విద్యార్థులకు గాయాలు

కోట: వాకాడు నుంచి విద్యానగర్‌లోని కళాశాలకు మోటార్‌సైకిల్‌పై వెళుతున్న ఇద్దరు విద్యార్థులను ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొన్న సంఘటన శుక్రవారం వీరారెడ్డిసత్రం వద్ద జరిగింది. ఈ ప్రమాదంలో విద్యార్థులు శివ, మున్నాకు గాయాలయ్యాయి. స్థానికులు వారిని కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. ప్రమాదంపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం నేరం

సూళ్లూరుపేట: ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం నేరమని రవాణాశాఖ అధికారి అనిల్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గోకులకృష్ణ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల సహకారంతో ప్రధాన రహదారుల్లో ఆటోడ్రైవర్లు, దిచక్రవాహనచోదకులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా వెళ్లే వారిని ఆపి, హెల్మెట్ ధరించి ప్రయాణించండని రోజా పువ్వు ఇచ్చి మరీ చెప్పారు.

ఉచిత గుండె వైద్య శిబిరం రేపు

సూళ్లూరుపేట: స్థానిక ప్రభుత్వాస్పత్రి వీధిలోని అన్నపూర్ణ పాలీ క్లినిక్ (డాక్టర్ మస్తానమ్మ ఆస్పత్రి)లో ఆదివారం ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆ క్లినిక్ యజమాని మస్తానమ్మ తెలిపారు. ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ అభిషేక్ కాషా పాల్గొంటారన్నారు.

అందరి కష్టం ఎరిగిన వ్యక్తి జగనన్న

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



ఉచ్చూరులో వ్యవసాయ పనులకు వెళుతున్న మహిళా కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

దొరవారిసత్రం: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల కష్టం ఎరిగిన ఏకైక వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. ఉచ్చూరు, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఎదురైన ప్రతి సమస్యను ఎంతో ఓపికగా ఎమ్మెల్యే వినడమే కాకుండా సున్నితంగా సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగారు. ఇందులో ముఖ్యంగా ఇళ్లు, విద్యుత్ సమస్యలు ఉన్నాయని స్థానికులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి తీసువచ్చారు. వీటిపై స్పందించిన ఆయన వెంటనే ఆయా శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కారం దిశగా చర్యలు చేపట్టారు. ఉచ్చూరు గ్రామం, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్లను పంపిణీ చేస్తూ ఆయా కుటుంబానికి ఏఏ పథకాలు అందాయన్న విషయం వివరించారు. ఇంకా ఏమైన పథకాలు అందాల్సి ఉందా? ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ పథకం అందిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో సమస్యలను సైతం దృష్టిలో ఉంచుకుని వేసవి కాలం సమీపించక ముందే తాగునీటి సమస్యలున్న గ్రామాలను గుర్తించి, ప్రత్యేక చర్యలు చేపట్టబోతున్నామని తెలిపారు. అలాగే గ్రామాల్లో ఎక్కడా విద్యుత్ సమస్యలు లేకుండా ఎక్కడికక్కడే చర్యలు తీసుకోన్నారు. ప్రతి ఒక్కరికీ భూహక్కు కల్పించేందుకే రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే పనులు ముమ్మరంగా చేస్తుందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుల కష్టాలు తీర్చేందుకే గ్రామస్థాయిలో ఆర్బీకేలు, సచివాలయ వ్యవస్థ తదితరాలు తీసుకువచ్చిన ఘనత జగనన్న దక్కుతుందన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలకు అభ్యున్నతికి, రైతుల కష్టం తెలిసిన ఏకైన వ్యక్తి మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ విషయాలను గుర్తించి, రానున్న ఎన్నికల్లో జగనన్నకే ఓటు వేసి వైఎస్సార్ సీపీకే పట్టం కట్టాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట చెంగాళ్లమ్మ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రమేష్, సర్పంచ్ పద్మమ్మ, నేతలు బీ వెంకటరమణయ్య, తిరుమలరెడ్డి, వాసుదేవయ్య, వెంకటేశ్వర్లు, భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గోపిరెడ్డి, బాసిరెడ్డి, సురేష్‌రెడ్డి, జలంధర్‌రెడ్డి, ఎంపీడీఓ సింగయ్య, తహసీల్దార్ గోపినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల అభ్యున్నతికి నిరంతర కృషి



మాట్లాడుతున్న రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గం సమన్వయ కర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన వాకాడులోని తన నివాసంలో గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల నేతలతో పలు అంశాలపై చర్చించారు. అనంతరం రామ్‌కుమార్‌రెడ్డిని వివిధ మండలాల నుంచి నేతలు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం సూచన మేరకు జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు అందరిని కలుపుకుని పార్టీ కార్యకలాపాలు నిర్వహించి, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పార్టీ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తించి, రానున్న ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధిస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలతో ప్రత్యర్థుల గుండెల్లో ఓటమి గుబులు పట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొడవలూరు దామోదర్‌రెడ్డి, నేదురుమల్లి హిమకుమార్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ చిట్టమూరు మండల కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, గూడూరు సుధాకర్‌రెడ్డి, వేమారెడ్డి షనీల్‌రెడ్డి, శశిరెడ్డి, మెట్టు శ్రీహరి, పి కిషోర్, వి రవి, భాస్కర్‌రెడ్డి, పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేదురుమల్లితో గూడూరు జేసీఎస్ కన్వీనర్ల భేటీ

గూడూరు: నూతనంగా నియమితులైన గూడూరు మున్సిపాలిటీ, మండలాల జేసీఎస్ కన్వీనర్లు వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని శుక్రవారం కలిశారు. మున్సిపాలిటీతోపాటు నియోకవర్గంలోని 5 మండలాలకు జేసీఎస్ కన్వీనర్లను తిరుపతిలో జరిగిన సమావేశంలో ఎంపిక చేశారు. గూడూరు మున్సిపాలిటీకి కందాటి రాఘవరెడ్డి, గూడూరు రూరల్‌కు సూరిబోయిన శ్రీహరి, చల్లకూరుకు యదనపర్తి మనోజ్‌కుమార్ రెడ్డి, కోటకు షేక్ ముబీన్‌బాషా, వాకాడుకు బందిల రంగయ్య, చిట్టమూరు మండలానికి చేరెడ్డి రాజశేఖర్‌ను నియమించారు. వీరందరూ రామ్‌కుమార్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా గ్రామోత్సవం



స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరురూరల్: మండలంలోని తిప్పవరప్పాడులో గురువారం రాత్రి చెన్నూరు–తిప్పవరప్పాడు గ్రామాల గ్రామదేవత కటాలమ్మ ఉత్సవంతోపాటు సీతారాముల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ గ్రామోత్సవంలో ఎమ్మెల్యే వరప్రసాద్ రావు పాల్గొని కటాలమ్మ అమ్మవారు, సీతారాములను దర్శించుకున్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు నాయుడుపేట క్రీడాకారిణి



దీనా ప్రిన్సీ

నాయుడుపేటటౌన్: జాతీయ పాఠశాల స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు నాయుడుపేట క్రీడాకారిణి దీనా ప్రిన్సీ ఎంపికైనట్లు నాయుడుపేట స్పోర్ట్స్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు మోమిడి లక్ష్మయ్య తెలిపారు. నా యుడుపేట జెడ్పీ హైస్కూలులో ఎనిమిదో తరగతి చదువున్న దీనాప్రిన్సీ శుక్రవారం శ్రీకాకుళంలో జరిగిన పాఠశాలల రాష్ట్రస్థాయి పోటీల్లో 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయస్థానంలో నిలిచి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఆ బాలికతోపాటు ఆమెకు శిక్షణ ఇచ్చిన ఎస్ఎస్ఎఫ్ నిర్వాహకులు, ఉన్నత పాఠశాల హెచ్ ఎం దొరస్వామి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

లౌకికవాదులంతా తరలిరావాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

గూడూరు: పట్టణంలోని సీఆర్‌రెడ్డి ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ భవన్‌లో శనివారం నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశానికి లౌకికవాదులంతా తరలిరావాలని మైనార్టీ నేత ఎండీ అన్వర్‌బాషా పిలుపునిచ్చారు. స్థానిక ప్రధాన తపాలా కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈ మేరకు హిందూ ముస్లిం ఐక్యత రౌండ్ టేబుల్ సమావేశం కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ముస్లింల ఐక్యత కోసం జైభారత్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి అందరూ హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నేతలు భాస్కర్‌గౌడ్, జైభారత్ ప్రతినిధి నాగరాజు, ఇన్సాఫ్ కమిటీ రాష్ట్ర ఉప కార్యదర్శి ఎస్‌కే జమాలుల్లా పాల్గొన్నారు.

మానసిక రుగ్మతలను జయించాలి



అవగాహన కల్పించిన ఫిజియోథెరిపిస్టు పవన్ కల్యాణ్

నాయుడుపేటటౌన్: ఉద్యోగులు, మహిళలు ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా ఉంటూ మానసిక రుగ్మతలను జయించాలని హైదారాబాద్ నిజాం ఇన్‌స్టిట్యూట్ ఫిజియోథెరిపిస్టు పవన్ కల్యాణ్ సూచించారు. స్థానిక శ్రీశక్తి భవన్‌లో శుక్రవారం వైఎస్సార్ క్రాంతిపథం అధికారులు, సీసీలు, వీఓఏలకు నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఫిజియోథెరిపీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిజియోథెరిపిస్టు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండ వ్యాయామం చేస్తూ శరీరానికి శ్రమ కలిగించాలని సూచించారు. సదస్సులో ఏపీఎం టీ ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

చోరీపై విచారణ

కోట: విద్యానగర్‌లో ఉపాధ్యాయురాలు జ్యోతిరాణిపై దాడి చేసి, బంగారు గొలుసు అపహరించిన కేసుకు సంబంధించి పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. ఇంట్లో ఒంటిరిగా ఉన్న మహిళపై గుర్తు తెలియని వ్యక్తి దాడి చేసి, మెడలో ఉన్న ఆరున్నర సవర్ల బంగారు చైన్ అపహరించాడు. గురువారం రాత్రి జరిగిన ఈ ఘటనపై బాధితురాలు ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పుల్లారావు తెలిపారు. ఉచ్చూరువారిపాళేనికి చెందిన ఓ యువకుడిని అనుమానితుడిగా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. విచారణ తరువాతే వివరాలు వెల్లడిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరానే లక్ష్యం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఈఈ, ఏడీలు తదితరులు

గూడూరు: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ట్రాన్స్‌కో ఈఈ ఇస్మాయిల్ అహ్మద్ అన్నారు. పట్టణ సమీపంలోని గోగినేనిపురంలోని డివిజనల్ ఎలక్ట్రికల్ కార్యాలయంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023– 24 సంవత్సరాలకుగాను విద్యుత్ చార్జీల పెంపుపై మూడు రోజులపాటు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తామని చెప్పారు. ఈ వీసీలో ప్రజలు తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. ఈ ఆర్థిక సంవత్సరానికిగాను గృహ వినియోగదారుల చార్జీల్లో ఎలాంటి మార్పులు ఉండబోవన్నారు. ఇండస్ట్రీయల్ సెక్టార్ల ట్యారీఫ్‌ల్లో కొన్ని మార్పులున్నాయన్నారు. ఈ విషయమై ప్రజలు తమ అభిప్రాయాలను ఈ నెల 21వ తేదీ వరకు తెలియజేయవచ్చన్నారు. ఏడీ ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు ఏకాగ్రతతో నడపాలి



సదస్సులో మాట్లాడుతున్న ఆర్టీఓ రవీంద్రనాథ్

గూడూరు: వాహనాలను నడిపే సమయంలో డ్రైవర్లు ఏకాగ్రతతోపాటు అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రాంతీయ రవాణా శాఖాధికారి రవీంద్రనాథ్ పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఆర్టీఓ కార్యాలయంలో శుక్రవారం డ్రైవర్లకు అవగాహన సదుస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహనాలను నడిపే సమయంలో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ, ఎంతో అప్రమత్తంగా ఏకాగ్రతతో నడపాలన్నారు. ప్రయాణికులను గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాల్సిన బాధ్యత బస్సు డ్రైవర్లపై ఉందన్నారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం వెంకటేశ్వరరావు, రూరల్ సీఐ దశరథరామారావు, ఏంవీఐ జకీర్, సునీల్‌రెడ్డి, ఏఓ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ సాగులో సస్యరక్షణ చేపట్టాలి



వేరుశనగ పొలంలో బుట్టలు ఏర్పాటు చేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

చిల్లకూరు: తీర ప్రాంతంలోని ఇసుక భూముల్లో సాగు చేసే వేరుశనగలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, అప్పుడే మంచి దిగుబడులు వస్తాయని అదానీ ఫౌండేషన్ కృష్ణపట్నం పోర్టు వ్యవసాయ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ సెల్వరాజ్ తెలిపారు. మండలంలోని నెల్లూరుకు చెందిన కృషి విజ్ఞాన్ కేంద్రం ఆత్మవారి సహకారంతో లింగవరం గ్రామంలో సుమారు 70 మంది రైతులు సాగు చేస్తున్న వేరుశనగ పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక భూముల్లో వేరుశనగ పంట ఏపుగా వస్తుందని, అయితే పంట మార్పిడి చేపట్టడం ద్వారా దిగుబడులు బాగుంటాయని చెప్పారు. నేటి వాతావరణ పరిస్థితుల ప్రభావంతో ఎక్కువగా ఆకుపై మంచు కురుస్తున్నందున ఆకుముడ తెగులు వస్తుందన్నారు. ఫౌండేషన్ సీఎస్ఆర్‌లో భాగంగా ఇలాంటి సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నామని తెలిపారు. అనంతరం వేరుశనగ పొలాల్లో తెగుళ్ల నివారణకు బుట్టల ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు రఫీ, అనూషా, రమేష్ పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సంఘం ఎన్నిక ఏకగ్రీవం



మస్తాన్‌ను అభినందిస్తున్న ఎంపీపీ తనూజారెడ్డి

వెంకటగిరి రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తంబిరెడ్డి తనూజారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వెంకటగిరి రూరల్ మండల సర్పంచ్‌ల సంఘం ఎన్నిక నిర్వహించారు. అమ్మపాళెం పంచాయతీ సర్పంచ్ తుమ్మూరు మస్తాన్‌రెడ్డి సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ తనూజారెడ్డి మాట్లాడుతూ మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులను సమన్వయం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సూచించారు. నూతన అధ్యక్షుడు తుమ్మూరు మస్తాన్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో తనకు పదవి అప్పగించడంతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు మస్తాన్‌ని ఎంపీపీ అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాయుడుపేటటౌన్: పట్టణంలోని శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు వద్ద విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో పట్టణ ఏఈ అర్జున శుక్రవారం తెలిపారు. శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డుతోపాటు శ్రీరామ్ నగర్, ఆశోక్‌నగర్, కోళ్లఫారమ్, సప్తగిరికట్ట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

కండలేరులో 51.065 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటి కి 51.065 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రేగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 1,460 క్యూసెక్కులు, పిన్నెరు వాగుకు 50, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయిస్‌కు 30, హైలెవల్ స్లూయిస్‌కు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

భూహక్కు.. భూ రక్ష పథకం సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న రీసర్వే ప్రత్యేకాధికారి భాస్కర్‌రెడ్డి

దొరవారిసత్రం: జగనన్న భూ హక్కు.. భూ రక్ష పథకం సద్వినియోగం చేసుకోవాలని రీ సర్వే ప్రత్యేకాధికారి భాస్కర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సూరపుఅగ్రహారంలో ఆయన ఆధ్వర్యంలో సాదాబైనామా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రిమెంట్లతో భూములు కొనుగోలు చేసిన రైతుల విషయంలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసురావాలని సూచించారు. అగ్రిమెంట్లపై భూములు కొనుగోలు చేసిన రైతులకు జగనన్న భూహక్కు భూరక్ష పథకం మంచి అవకాశమని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబు, సర్వేయర్ రామరావు, ఆర్ఐ స్వర్ణలత, వీఆర్వో జ్ఞానేంద్ర పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయండి



లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిల్లకూరు: జగనన్న పక్కాగృహాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి, ఉగాది నాటికి సామూహిక గృహప్రవేశాలు చేపట్టేలా చూడాలని మండల స్థాయి అధికారులు లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని ఓడూరు, తిమ్మనగారిపాళెంలో లబ్ధిదారులకు శుక్రవారం ఇళ్ల నిర్మాణాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మండలంలో మొత్తంగా 519 పక్కా గృహాలు నిర్మాణాలను చేపట్టాల్సి ఉందని, వీటిని సకాలంలో పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీఓ విష్ణుచిరంజీవి, హౌసింగ్ ఏఈ అహ్మద్‌బాషా, ఉపాధి ఏపీఓ గిరి, సర్పంచ్‌లు నాగిశెట్టి శారదమ్మ, గిద్దలూరు సుమలత పాల్గొన్నారు.

కారులో మంటలు



వెంకటగిరి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శుక్రవారం రాత్రి వెంకటగిరి నివాసి రాజు అనే వ్యక్తికి చెందిన కారులో బ్యాటరీ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు రేగాయి. స్థానికులు కథనం మేరకు.. రాజు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో పార్కు చేసి మందుల దుకాణంలో మాత్రలు కొనుగో లు చేసేందుకు వెళ్లాడు. ఆ సమయంలో కారు నుంచి మంటలు చెలరేగడంతో స్థానికులు, బాధితుడు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వారు హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలు అదుపు చేశారు.

వైభవంగా గంధమహోత్సవం



గంధం చెల్లిస్తున్న ముతవల్లి జుబేర్‌బాషా

వెంకటగిరి: పట్టణంలోని లాలాగారివీధిలోని శ్రీహజరత్ ఖాదర్ వలీ దర్గా గంధ మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ముస్లిం మతపెద్దలు సంప్రదాయబద్ధంగా ప్రార్థనలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ఫాతేహా(చదివింపుల కార్యక్రమం) నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. గంధమహోత్సవం సందర్భంగా దర్గాకు విద్యుత్‌దీపాలంకరణ చేశారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: మండల కేంద్రంలోని దోషాహీద్ దర్గాకు అనుబంధంగా ఉన్న నాగూర్ ఖాదర్ ఔలియా దర్గాలో నిర్వహిస్తున్న గంధ మహోత్సవం శుక్రవారంతో ముగిసింది. ఏటా జనవరిలో చేపట్టే గంధమహోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, గంధం స్వీకరిస్తారు. ఈ క్రమంలో దర్గా ముతవల్లి జుబేర్‌బాషా మాట్లాడుతూ దోషాహీద్ దర్గా నెల్లూరులోని బారా షాహీద్ దర్గా అంతటి ప్రాముఖ్యత కలగి ఉందన్నారు. ఈ దోషాహీద్ దర్గాకు అనుబంధంగా ఉన్న నాగూర్ ఖాదర్ ఔలియా దర్గాకు కూడా ప్రతి వారం భక్తులు విచ్చేసి తమ మొక్కులు చెల్లించుకుంటారని అన్నారు. అనంతరం దర్గా ఆవరణలో అన్నదానం చేశారు.

నేడు మూడు మండలాల్లో విద్యుత్ నిలిపివేత

సూళ్లూరుపేట: మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరులోని 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేయనున్న దృష్ట్యా శనివారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు మూడు మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. తడ, దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండలాల్లో కలిగే విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపింది.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి



మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న ఎంఈఓ

దక్కిలి: విద్యలో వెనుకపడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టి, బోధించాలని ఎంఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని వెలికల్లు మెయిన్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ప్రభుత్వ పాఠశాలలో చదివేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల హాజరు, ఇటీవల జరిగిన పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులు, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు.

రిపబ్లిక్ డే వేడుకలకు ఎన్‌బీకేఆర్ విద్యార్థి



భార్గవ్‌ను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి

కోట: విజయవాడలో ఈ నెల 26వ తేదీ జరగనున్న రిపబ్లిక్ డే వేడుకలకు విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ బీటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థి ఎర్రసాని భార్గవ్ ఎంపికైనట్లు ఆ కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి సమక్షంలో జరగనున్న రిపబ్లిక్‌డే పెరేడ్‌లో భార్గవ్ పాల్గొంటారన్నారు. రాష్ట్ర రిపబ్లిక్‌డే వేడులకు భార్గవ్ ఎంపిక కాగా ఢిల్లీలో జరిగే రిపబ్లిక్‌డే వేడుకల పెరేడ్‌లో తమ కళాశాల విద్యార్థిని ఎన్‌సీసీ క్యాడెట్ కెప్టెన్ జాహ్నవి ప్రాతినిథ్యం వహించడం కళాశాలకు గర్వకారణమన్నారు. ఎన్‌సీసీ నావెల్‌వింగ్ అధికారి మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.